క్లుప్తంగా

స్పందన వినతులకు సత్వర పరిష్కారం

చిత్తూరు అర్బన్: స్పందనలో వచ్చే వినతులు, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించి, ప్రజల నుంచి పలు వినతులు తీసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రతీ ఒక్క ఫిర్యాదును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, క్షేత్రస్థాయిలో వాస్తవాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్‌తో పాటు సహాయ కమిషనర్ గోవర్ధన్, మునిసిపల్ ఇంజనీరు వెంకటప్రసాద్ తదితరులు స్పందనలో పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

యాదమరి: మండలంలోని 14 కండ్రిగ ముస్లిం వాడ పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమానికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్‌బాబు హాజరు కానున్నట్లు తెలిపారు. దీనికి మండలంలోని అధికారులు హాజరు కావాలని కోరారు.

ఉద్యోగి కుటుంబానికి బీమా పరిహారం



కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న సర్పంచ్ జయచంద్రారెడ్డి

పూతలపట్టు: మండలంలోని చిటిపిరాళ్ల గ్రామానికి చెందిన కె నారాయణ బాబు మదనపల్లెలోని ప్రైవేటు పాల డెయిరీలో పనిచేస్తూ మే 15న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో డెయిరీ వారు కుటుంబ సభ్యులకు డెత్ రిలీఫ్ ఫండ్ స్కీం ద్వారా 15.46 లక్షలు, కుటుంబ సంక్షేమ నిధి ద్వారా 4 లక్షల రూపాయలు అందజేశారు. ఈ చెక్కును సోమవారం చిటిపిరాళ్లలోని నారాయణ సతీమణి గీతకు సర్పంచ్ జయచంద్రారెడ్డి, డెయిరీ రీజనల్ మేనేజర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జయచంద్రారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, డెయిరీ మేనేజర్లు అమ్మినేని రవి, ఆనంద కుమార్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగాజాబ్ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29న మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల వైస్ చైర్మన్ శ్రీధర్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జాబ్‌మేళా వివిధ కంపెనీలు పాల్గొంటాయన్నారు. డిగ్రీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బీఎస్సీ కోర్సులు పూర్తి చేసిన, ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. అర్హత ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9493210966ను సంప్రదించాలన్నారు.

వైభవంగా ధర్మరాజు పట్టాభిషేకం



ధర్మరాజు పట్టాభిషేకం చేస్తున్న అర్చకులు

తవణంపల్లె: మండలంలోని ముట్టుకూరులో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడి మహా భారతయజ్ఞంలో భాగంగా సోమవారం రాత్రి ధర్మరాజుల పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ద్రౌపదీ సమేత ధర్మరాజులు, భీముడు, అర్జునుడు, నకులసహదేవలు, పోతురాజు విగ్రహాలను అభిషేకం, పూజలు, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం వేదమంత్రోచ్చారణ నడుమ ధర్మరాజులకు పట్టాభిషేకం చేయించారు. గ్రామస్తులు, ఉభయదారుల సహకారంతో ధర్మరాజు పట్టాభిషేకంతో మహాభారత యజ్ఞం ముగిసింది.

కోదండరామాలయం పునఃనిర్మాణం ప్రారంభం

రామకుప్పం: రామకుప్పంలో ప్రసిద్ధి గాంచిన పురాతన కోదండరామస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆలయ ధర్మకర్త, ట్రస్టీ మిట్టపల్లి విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు రామాలయం పునఃనిర్మాణం కోసం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా దేవదాయశాఖ అధికారులకు విన్నవించారు. స్పందించిన దేవదాయశాఖ ఆలయ నిర్మాణానికి రూ.18 లక్షలు మంజూరు చేసింది. అలాగే ఆలయ కమిటీ రూ.5 లక్షలు కార్పస్ ఫండ్‌ను చెల్లించింది. మొత్తం రూ.23 లక్షలతో నూతన కోదండరామాలయాన్ని నిర్మించనున్నారు. సోమవారం ఆలయంలో వేదపండితులు బాలాలయం ఏర్పాటు చేశారు. సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాల నుంచి మంగళ కలశాల్లోకి ప్రాణావాహన చేశారు.

మాతృ రక్షణే ప్రభుత్వ లక్ష్యం

- మరణాల కట్టడికి ప్రత్యేక చర్యలు
- రక్తహీనత నివారణకు ఎఫ్‌సీఎం ఇంజక్షన్లు
- రూ.2వేలు ఖరీదు చేసే ఇంజక్షన్ ఉచితం



ఆస్పత్రిలో రక్తహీనత బాధితులు



మహిళలకు వైద్య సేవలు చేస్తున్న సిబ్బంది

చిత్తూరు రూరల్: మాతాశిశు మరణాలను కట్టడి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. జిల్లాలో తల్లులను రక్తహీనత సమస్య వేధిస్తోంది. ఈ సమస్యను అధిగమించేలా మాతృమరణాల కట్టడికి పకడ్బందీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఈ మేరకు వైద్య సేవలను విస్తృతం చేస్తోంది. ఇప్పటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం కిట్లను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తూ వారిలో రక్తం వృద్ధి చెంది సంపూర్ణ ఆరోగ్యవంతులయ్యేలా చర్యలు చేపడుతోంది. రక్తహీనత వల్ల కలిగే ఇబ్బందులపై మహిళలకు అవగాహన కల్పిస్తోంది.

జిల్లాలో 13,874 మంది గర్భిణులు ఉన్నారు. బాలింతలు 18వేల మంది ఉన్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో 3986 మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. ఈ కారణంగానే ప్రసవానంతరం మరణాలు నమోదవుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. నాలుగేళ్లకు క్రితం మాతా శిశుమరణాలు 20పైగా ఉండేవి. ప్రస్తుతం ఆ కేసులు ప్రతినెలా 2 నుంచి 3 మాత్రమే నమోదవుతున్నాయి. మాతృ మరణాలను జీరో చూపించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వైద్య సేవలను మెరుగుపరుస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఐరన్ మాత్రలు, సుక్రోజ్ ఇంజక్షన్లు మాత్రమే ఇచ్చేవారు. అయితే ఢిల్లీలోని ఎయిమ్స్ (ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సె స్)లో ఉన్న నేషనల్ ఎనిమియా కంట్రోల్ రీసెర్చ్ విభాగం మార్గదర్శకాల మేరకు రక్తహీనతను త్వరితగతిన నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఎం (ఫెర్రిక్ కార్బాక్సీ మాల్టోజ్) ఇంజక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీని ధర రూ.2 వేలకు పైగా ఉన్నప్పటికీ ఉచితంగా అందిస్తోంది.

జిల్లా ఆస్పత్రి వివరాలు	
జిల్లా ఆస్పత్రి	1
ఏరియా ఆస్పత్రులు	4
సీహెచ్‌సీలు	7
అర్బన్ హెల్త్ సెంటర్లు	14
పీహెచ్‌సీలు	50

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవానంతరం ముందు జాగ్రత్త చర్యగా బాలింతలకు ఈ ఇంజక్షన్ ఇచ్చి డిశ్చార్జి చేస్తున్నారు. జిల్లాకు 4,516 ఎఫ్‌సీఎం ఇంజక్షన్లు మంజూరు కాగా, వాటిని అవసరమైన అన్ని ప్రాంతాలకు పంపిణీ చేసినట్లు వైద్య విధాన పరిషత్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తించి, ఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఈ నెల వ్యవధిలో 89 మందికి 172 డోస్‌లు ఎఫ్‌సీఎం ఇంక్షన్‌లు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

రక్తహీనతను పసిగట్టి..

ఆస్పత్రిలో ప్రసవానంతరం డిశ్చార్జి చేసే ముందు హిమోగ్లోబిన్ పరీక్ష చేసి ఎఫ్‌సీఎం ఇంజక్షన్ చేస్తారు. తిరిగి మూడు వారాల తరువాత హెచ్‌బీ పరీక్షలు చేసి అవసరాన్ని బట్టి ఈ ఇంజక్షన్ చేస్తారు. బాలింతల్లో రక్తహీనత నివారించే వరకు వైద్యులు పర్యవేక్షిస్తారు. చిన్నారులకు క్రమం తప్ప కుండా నిర్ణీత సమయంలో టీకాలు వేయించుకునేలా తల్లులకు అవగాహన కల్పిస్తారు.



- ఈమె పేరు దివ్య. ఊరు చిత్తూరు నగరంలోని శరవణపురం. రెండు రోజులకు క్రితం కాన్పు కోసం చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. గర్భిణి కావడంతో పౌష్టికాహారం సక్రమంగా, సరైన సమయానికి తీసుకోక రక్తహీనతకు దారితీసింది. ఆమెకు రక్తం అవసరమైంది. ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు రక్తం వృద్ధి చేసేందుకు ఎఫ్‌సీఎం ఇంజక్షన్లు ఉచితంగా ఇస్తున్నారు.



- ఈమె పేరు జానకి. తమిళనాడులోని గుడియాత్తానికి చెందిన ఈమె కాట్పాడిలో ఇటుకల తయారీ పని చేస్తున్నారు. ఈనెల 20న డెలివరీ తేదీ ఇచ్చారు. దీంతో ఆమెను కుటుంబీకులు చిత్తూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెకు ప్రస్తుతం రక్తం 7 శాతం ఉండడంతో రక్తం వృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు.

జీరో మరణాలే లక్ష్యం

జిల్లాలో తల్లుల మరణాలు జీరో చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గర్భిణీ అని తెలిసిన వెంటనే శాఖాపరంగా నమోదు కార్యక్రమాన్ని చేపట్టి, వారికి అవసరమైన వైద్య పరీక్షలను ఉచితంగానే చేయిస్తున్నాం. గర్భిణుల్లో రక్తహీనత ఉన్నట్లు తేలితే వారికి పౌష్టికాహారం,



వైద్య సేవలు అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటోంది. ఎఫ్‌సీఎం ఇంక్షన్‌ను ఉచితంగానే అందిస్తోంది. ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలకు ఈ విషయాన్ని పదేపదే చెబుతున్నాం.

–డాక్టర్ ప్రభావతీదేవి, జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి, చిత్తూరు

వ్యయాన్ని భరిస్తూ..

మహిళల ఆరోగ్య రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చును లెక్కచేయకుండా ఎఫ్‌సీఎం ఇంజక్షన్లు సరఫరా చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ ఇంజక్షన్లు బాలింతల్లో రక్తహీనత నివారణకు ఎంతో దోహద పడతాయి. సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా



ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాం. దీంతోపాటు విలువైన మందులను అందజేస్తోంది. ఈసేవలను గర్భిణులు వినియోగించుకోవాలి. క్షేత్రస్థాయిలో ఆశావర్కర్లు, బాలింతలు దీనిపై అవగాహన కల్పించాలి.

–బీఎస్‌కే నాయక్, డీసీహెచ్‌ఎస్, చిత్తూరు

ఆకట్టుకుంటున్న గిడుగు చిత్రం

యాదమరి: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్ గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రాన్ని వైవిధ్యంగా రూపొందించారు. రామ్మూర్తి పంతులు 1863–1940 వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు, బహుభాషా శాస్త్రవేత్త, చరిత్ర కారుడు, సంఘ సంస్కర్త, హేతువాది. ఆయనపై చిచ్చరపిడుగు గిడుగు పేరుతో కాదేదీ కవితకనర్హం అన్నట్లు ఆయన చిత్రాన్ని న్యూస్‌పేపర్‌పై చిత్రించడంతో ఆకట్టుకుంటోంది.



దామోదర ఆచారి



నీటి రంగులతో చిత్రించిన చిత్రం

పట్టు సాగుకు వాతావరణమే కీలకం

పలమనేరు: పట్టుపురుగుల పెంపకంలో వాతావరణమే కీలకపాత్ర పోషిస్తుందని గుర్తెరగాలని హిందూపూర్‌కు చెందిన పట్టు పరిశ్రమశాఖ సైంటిస్ట్ సీతారాములు అన్నారు. పట్టుపరుగులకు సంక్రమించే వ్యాధుల నివారణపై రైతులకు సోమవారం స్థానిక పట్టుగూళ్ల విక్రయ కేంద్రం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొంతకాలంగా ఈ ప్రాంతంలోని పెంచిన పట్టు పురుగులు చంద్రికల్లో వేశాక గూళ్లు కట్టకుండా తీరని నష్టాలు వస్తున్నాయని కొందరు రైతులు సైంటిస్ట్‌ల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన వారు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైంటిస్ట్ పైవిధంగా మాట్లాడారు. ముఖ్యంగా పట్టు పురుగులకు తగినంత స్థలం ఇచ్చి వాటిని పెంచాలన్నారు. అప్పుడే అవి ఆరోగ్యవంతంగా పెరిగి నాణ్యమైన గూళ్లను ఉత్పత్తి చేస్తాయన్నారు. తక్కువ స్థలంలో ఎక్కువ పట్టుపరుగులను పెంచినట్‌లైతే పాలపురుగులుగా మారి గూళ్లు కట్టని పరిస్థితి కలుగుతుందన్నారు. అలాగే ఈ ప్రాంతంలో ఎక్కువగా బైవోల్టిన్ పట్టుపురుగుల సాగు ఎక్కువగా ఉందని, చాకీ కేంద్రాల నుంచి తెచ్చే పురుగుల సీడ్ సరిగా లేకున్నా ఇలాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

చాకీ సెంటర్ల నిర్వాహకులపై చర్యలేవీ?

అనంతరం పలువురు రైతులు సైంటిస్ట్‌లతో మాట్లాడుతూ, చాకీ సెంటర్లలో రైతులకు విక్రయించే పట్టు పురుగులు నాణ్యంగా ఉన్నాయా, లేదా? అని పట్టు పరిశ్రమశాఖ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తాము తీసుకున్న పట్టు పురుగులు గూళ్లను కట్టకుంటే కలిగిన నష్టాన్ని చాకీ సెంటర్ నిర్వాహకుల నుంచి పరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు ఉన్నతాధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలమనేరు సెంట్రల్ సిల్క్ బోర్డు సైంటిస్ట్ వెంకటాచలం, స్థానిక సెరికల్చర్ ఏడీ కిశోర్ నాయక్, మండల సెరికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

నేడు తెలుగుభాషా దినోత్సవం

గుడిపాల: గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించికొని మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని మండల కేంద్రంలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్లో నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ తెలిపారు. దీనికి హరివిల్లు చిత్తూరు కళావేదిక అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు హరినాయుడుతోపాటు ప్రముఖ కవి గోల్ల పిన్ని సుబ్రమణ్యం ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన తెలిపారు.

నేడు అయ్యప్ప స్వామి ఆలయంలో ఓనమ్ పూజలు

చిత్తూరు రూరల్: స్థానిక ప్రశాంత్ నగర్ కాలనీలో వెలసిన శ్రీ శాస్తాగిరి అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం ఓనమ్ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈనెల 30వ తేదీన రాత్రి 8 గంటలకు ఆలయం మూసివేస్తామన్నారు.

31న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ కేంద్రం ప్రారంభం

సదుం: స్థానిక సచివాలయం–2లో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కేంద్రాన్ని ఈనెల 31న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. కార్యాలయ పనులను సోమవారం వారు పరిశీలించారు. ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తే ఇక నుంచి సదుం, సోమల, పులిచెర్ల మండల ప్రజలు ఇక్కడే అన్ని సేవలు పొందవచ్చని, పీలేరు కార్యాలయానికి వెళ్లవనసరం పేర్కొన్నారు. కార్యక్ర మంలో ఆ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ గిరిబాబు, పలమనేరు, పుంగనూరు సబ్ రిజిస్ట్రార్లు పద్మశేఖర్ రెడ్డి, బాలాజి, సదుం ఇన్‌చార్జి షానవాజ్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలు, బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్, అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల గోడ పత్రికలు, ఆహ్వాన పత్రికలను సోమవారం ఉదయం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఉభయదారులు ఆవిష్కరించారు. ఉదయం ఎమ్మెల్యే కాణిపాకం విచ్చేయగా ఆలయ చైర్మన్, ఈఓ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ప్రత్యేక దర్శన అనంతరం ఆలయ ధ్వజస్తంభం వద్ద వార్షిక బ్రహ్మోత్సవాల గోడ పత్రికలు, ఆహ్వాన పత్రికలు, బుక్‌లెట్లు, గణేష దీక్షకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ గోడపత్రికలు, ఆహ్వాన పత్రికలు పలు రాష్ట్రాలలో భక్తులకు తెలియజేసేలా చూడాలని సంబంధిత అధికారులను కోరారు. సెప్టెంబర్ 10 కల్లా అన్ని పనులు పూర్తి కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాణిపాక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఆలయ ఏఈఓ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి, ఐరాల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలు శుభ్రం

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలను సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ఆదేశాల మేరకు కాణిపాక ప్రధాన ఆలయం, శివాలయం, అతిథి గృహాల వద్ద, పార్కుల్లో చెత్తాచెదారం తొలగించారు. వారు కూలీలతో మాట్లాడుతూ పరిసరాలు సైతం పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటివద్దకే వైద్యసేవలు



వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ అనూష



వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ హరి

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటివద్దకే వైద్యసేవలు అందజేస్తున్నట్లు గుడిపాల, బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారులు హరి, అనూష పేర్కొన్నారు. మండలపరిధిలోని బట్టువాళ్లూరు, కొత్తకోట గ్రామంలో సోమవారం 104 వైద్య సేవలను అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లోనే ప్రతి ఇంటి ముంగిటకు వైద్య సేవలను అందజేస్తున్నామన్నారు. అనంతరం 120 మంది రోగులకు బీపీ, షుగర్, గర్భవతులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. బట్టువాళ్లూరు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ డాక్టర్ హరి వైద్యపరీక్షలు చేశారు. మంచం పట్టిన రోగులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రశేఖర్, సోని, లత, సింధుజ, సుమతి, కవిత, హైమావతి, కిషోర్ పాల్గొన్నారు.

వేదగిరివారిపల్లెలో..

ఐరాల: మండలంలోని వేదగిరివారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సోమవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచి తంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సేంద్రియ సేద్యం

- ఎకరాకు రూ.లక్ష ఆదాయం
- చిరు రైతులకు ఆదర్శం
- పంటలు ఆరోగ్యకరం



సాగులో ఉన్న నూతన రకం వరి పంట

ఐరాల: సేంద్రియ పద్ధతిలో ఆరోగ్యకరమైన పంటలు పండిస్తూ ఆదర్శ రైతుగా ఇప్పటికే పేరు పొందారు. వరి, వేరుశనగ పంటలు సహజసమైన పద్ధతుల ద్వారా సాగు చేశారు. ఆయనే మండలంలోని 35 యర్లంపల్లెకు చెందిన ప్రభాకర్‌రెడ్డి. సేంద్రియ పద్ధతిలో పండించి మంచి దిగుబడులు సాధించి లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతు ఎన్.జీ రంగా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సూచనల మేరకు, సరికొత్త రకాలను సాగు చేస్తుండడం మరో విశేషం. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నారు. రైతు ఎకరా పొలంలో మండలంలో తొలిసారి నూతన రకం వరి 1,638 కూనారమ్ కేఎస్‌ఎం సాగు చేస్తున్నారు. ఈ రకం వరి పంట ప్రత్యేకతలు బీపీటీ 5,204 రకంలాగానే బియ్యం సన్నగా ఉంటుందని రైతు చెబుతున్నారు. ఈ రకం పంట 120 రోజుల నుంచి 130 రోజులకు కోతకు వస్తుంది. వర్షాలు అధికంగా కురిసినా ఈ రకం పంట నేలకు ఒరగకపోవడం ప్రత్యేకత. మిగత రకాల కన్నా ఈ పంటలో ఎక్కువగా పిలకలు వస్తాయి. ఎకరా పొలంలో 40 బస్తాల దిగుబడి వస్తుంది. దీని వల్ల ఖర్చు పోనూ ఎకరాకు రూ.లక్ష ఆదాయం వస్తుంది. రసాయనిక ఎరువులు వాడకుండా పశువుల ఎరువు, పచ్చి రొట్ట, వేపపిండి తదితర ప్రకృతి ఎరువులను వాడుతూ సాగు చేస్తున్నారు.

1694 విశిష్ట వేరుశనగ

తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం విడుదల చేసిన 1694 విశిష్ట వేరుశనగ రకాన్ని రైతు ఎకరా పొలంలో సాగు చేస్తున్నారు. ఈ రకం వేరుశనగ బెట్టను తట్టుకొనే వర్షాధారమైన పంట. కాయలు నాణ్యతగా ఉంటాయని రైతు చెబుతున్నారు. ఈ రకం పంటలో కాయలు ఒకేసారి పక్వానికి వస్తా యి. ఎకరానికి 20 నుంచి 30 బస్తాలు దిగుబడి వస్తుంది. ఎకరాకు పెట్టుబడి రూ.30 వేలు ఖర్చవుతుంది. ఖర్చు పోనూ రూ.60 వేలు ఆదాయాన్ని గడిస్తున్నారు. పశువుల ఎరువు ఎక్కువగా వాడినట్లు అయితే దిగుబడి మరింత ఎక్కువగా వచ్చే రకం ఇది. దీంతో పాటు అంతర పంటలుగా జొన్న, అలసంద, కంది సాగు చేస్తూ నెలకు రూ.30వేలు సంపాదిస్తున్నాడు.



సాగులో ఉన్న వేరుశనగ పంట

ఎకరానికి రూ.లక్ష

సేంద్రీయ పద్ధతిలో వరి, వేరుశనగ సాగు చేశాను. గత ఏడాది రెండు ఎకరాల్లో వేస్తే రూ. లక్ష ఆదాయం వచ్చింది. పెట్టుబడి తక్కువ నాణ్యమైన దిగుబడి రావటంతో ఈ పంటకు మార్కెట్‌లో మంచి ధర లభించింది. దీంతో ప్రస్తుతం



కొత్తరకం వరి, వేరుశనగ సాగు చేస్తున్నాను. రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించడం మానేసి తెగుళ్ల నివారణకు కేవలం కషాయాలు వాడుతున్నాం. సేంద్రియ వ్యవసాయమే మేలు – ప్రభాకర్‌రెడ్డి, ఆదర్శ రైతు, 35 యర్లంపల్లె, ఐరాల

కుప్పంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలి

రామకుప్పం: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కుప్పంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆ పార్టీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త, చిత్తూరు ఎమ్మెల్సీ భరత్‌కు సూచించారు. సోమవారం నగరి పర్యటనకు వచ్చిన సీఎంను ఎమ్మెల్సీ భరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. కుప్పంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల గురించి సీఎంకు వివరించారు. అలాగే హంద్రీ–నీవా పనులు వేగవంతంగా చేస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దొంగ ఓట్ల తొలగింపునకు పార్టీ శ్రేణులు పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం'లో సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో కుప్పంలో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని భరత్ సీఎంకు తెలిపారు. అదేవిధంగా కుప్పం అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు భరత్ తెలిపారు.

సీఎంను కలిసిన ఎంపీపీల సంఘం అధ్యక్షుడు రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: నగరి పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు, కుప్పం ఎన్నికల పరిశీలకులు మొగసాల రెడ్డెప్ప కలిశారు. బైరెడ్డిపల్లె నుంచి పేర్నంబట్ వరకు అంతర్రాష్ట్ర రహదారి ఏర్పాటు మండల ప్రజలకు కలగా మిగిలిపోయిందని, రహదారి ఏర్పాటుకు కృషి చేయాలని సీఎంను కోరినట్లు ఆయన తెలిపారు.